## ఎమ్మెల్సీ కవితను కలిసిన విజిత్‌రావు దంపతులు

మంచిర్యాలటౌన్, ఆగస్టు 29 : ఢిల్లీ మద్యం కేసులో అరెస్టై.. బెయిల్‌పై వచ్చిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను గురువారం హైదరాబాద్‌లో మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు తనయుడు, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్‌రావు, ఆయన సతీమణి ఉదయశ్రీ మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించారు. ఎన్నో కుట్రలు చేసి కేసీఆర్‌ను, ఆయన కుటుంబాన్ని ఇబ్బందులు పెట్టాలని చూశారని, చివరకు న్యాయమే గెలిచిందని విజిత్‌రావు పేర్కొన్నారు.


ఎమ్మెల్సీ కవితకు పుష్పగుచ్ఛం అందిస్తున్న విజిత్ రావు, ఉదయశ్రీ

## గైర్హాజరైన ఉపాధ్యాయుడి సస్పెన్షన్

వేమనపల్లి, ఆగస్టు 29 : క్యాతనపల్లి, కల్మలపేట, ముల్కలపేట గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను గురువారం డీఈవో యాదయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్యాతనపల్లి పాఠశాలను పరిశీలించి.. గైర్హాజరైన ఉపాధ్యాయుడు సునీల్‌కుమార్‌ను వెంటనే సస్పెండ్ చేశారు. క్యాతనపల్లి పాఠశాల ఉపాధ్యాయురాలు శ్యామల, ముల్కలపేట ఉపాధ్యాయురాలు కవితకు షోకాజ్ నోటీసులు అందజేశారు. పాఠశాలల్లోని రికార్డులను పరిశీలించారు. డీఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పాఠశాలలకు హాజరుకాకపోయినా రిజిష్టర్‌లలో సంతకాలు చేస్తే తీవ్ర చర్యలుంటాయని పేర్కొన్నారు. డీఈవో విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. డీఈవో వెంట సెక్టోరల్ అధికారి చౌదరి, కాంప్లెక్స్ హెచ్‌ఎం గిరిధర్‌రెడ్డి, సీఆర్‌పీలు ఉన్నారు.


రిజిస్టర్‌లను తనిఖీ చేస్తున్న డీఈవో యాదయ్య


మృతి చెందిన ఎద్దువద్ద కన్నీరు పెట్టుకుంటున్న రైతు కుటుంబం

## దేవుడా ఎంతపనాయే..

● కళ్లెదుటే జోడెద్దులు మృతి

● వాటితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకొని రోదించిన రైతు కుటుంబం

కోటపల్లి, ఆగస్టు 29 : ఆ కుటుంబానికి జీవనాధారమైన జోడెద్దులు హఠాత్తుగా మృతి చెందగా, ఆ రైతు కుటుంబం గుండెలవిసేలా రోదించింది. ఈ ఘటన కోటపల్లి మండలం సిర్సా గ్రామంలో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన ఏతం రాజయ్య ఎకరం కౌలుకు తీసుకొని పత్తి సాగు చేస్తున్నాడు. ఎప్పటిలాగే ఉదయం తన ఎడ్లను బండికి కట్టి చేనుకు చేరుకున్నాడు. భార్య, పిల్లలతో కలిసి వ్యవసాయ పనుల్లో నిమగ్నంకాగా, ఒక్కసారిగా రెండు ఎడ్లు కుప్పకూలిపోయాయి. ఆందోళనకు గురైన రాజయ్య వాటి వద్దకు చేరి పరిశీలించే లోపే అవి మృత్యువాత పడ్డాయి. కంటికి రెప్పలా కాపాడుకున్న ఎడ్లు కళ్ల ముందే అనుమానాస్పదంగా చనిపోగా, కుటుంబ సభ్యులు వాటిపై పడి.. 'అయ్యో దేవుడా.. ఎంతపనాయే'.. అంటూ రోదించారు. వాటితో ఉన్న అనుబంధాన్ని.. అవి అందించిన సేవలను గుర్తు చేసుకొని కంట తడి పెట్టడం అక్కడున్న వారిని కలచివేసింది. ఎడ్ల విలువ రూ.80 వేల దాకా ఉంటుందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని వారు వేడుకుంటున్నారు.


# మాఫీ కావాలంటే.. అఫిడవిట్ ఇయ్యాలే

**రైతన్నల నుంచి రాయించి తీసుకుంటున్న సర్కారు**

● రేషన్‌కార్డు లేనోళ్ల వివరాలు మాత్రమే సేకరణ ● మరి బ్యాంక్ అకౌంట్, ఆధార్ కార్డులో తప్పులుండి మాఫీ కానోళ్ల సంగతేమిటని ప్రశ్నిస్తున్న అన్నదాతలు

● సమాధానమివ్వకుండా తప్పించుకుంటున్న అధికారులు ● రుణమాఫీపై మరింత గందరగోళ పరిస్థితి

రైతుల నుంచి అధికారులు తీసుకుంటున్న అఫిడవిట్


ధ్రువీకరణ పత్రం

మంచిర్యాల, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రుణమాఫీ కాని రైతుల పరిస్థితి పొయ్యి మీద నుంచి పెనంలో పడినట్లయ్యింది. రూ.రెండు లక్షల లోపు రుణం.. అన్ని అర్హతలు ఉండి కూడా రుణమాఫీ కాని రైతులుంటే దరఖాస్తు చేసుకోమని చెప్పిన అధికారులు, తీరా దరఖాస్తులు చేసుకున్నాక మళ్లీ ఇప్పుడు సర్వే అంటున్నరంటూ అన్నదాతలు మండిపడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా బుధవారం నుంచి సర్వే మొదలైంది. మండలం యూనిట్‌గా రైతుల వివరాలు సేకరిస్తున్నారు. అధికారులే ఊళ్లకు వచ్చి మరీ రైతుల వివరాలు తీసుకుంటారని చెప్పడంతో రైతులంతా గ్రామ పంచాయతీ కార్యాలయాలు, రైతు వేదికల దగ్గర వేచి చూస్తున్నారు. ఇకపోతే రుణమాఫీ కాని రైతుల నుంచి వివరాల నమోదుకు ముందు అధికారులు ఓ అఫిడవిట్ తీసుకుంటున్నారు. ''కుటుంబ సభ్యుల నిర్ధారణ కోసం నేను ఇస్తున్న నా కుటుంబ సభ్యుల వివరాలన్నీ వాస్తవం. రుణమాఫీ పొందడానికి తప్పుడు సమాచారం ఇచ్చినట్లు గుర్తించినా లేదా మోసపూరితంగా పంట రుణాన్ని పొందినట్లు తేలినా.. పంట రుణానికి అర్హత లేదని నిర్ధారించినా.. పొందిన రుణమాఫీ మొత్తాన్ని తిరిగి ప్రభుత్వానికి చెల్లించడానికి అంగీకరిస్తున్నా. ఆ మొత్తం రికవరీ చేయడానికి చట్ట ప్రకారం వ్యవసాయశాఖ సంచాలకులకు అధికారం ఉంటుంది'' అని అఫిడవిట్ రాయించుకుంటున్నారు. దీంతో రైతులు హైరానా పడిపోతున్నారు. అఫిడవిట్ ఎందుకు సార్ అంటే రుణమాఫీ కావాలంటే అఫిడవిట్ ఇవ్వాల్సిందేనని చెబుతున్నారు.

### రేషన్‌కార్డు లేనోళ్లకేనా.. అందరివీ తీసుకోరా..

సర్వే కోసం వచ్చిన అధికారులు కొన్ని మండలాల్లో రేషన్‌కార్డు లేని రైతుల వివరాలు మాత్రమే యాప్‌లో నమోదు చేస్తున్నారు. వాస్తవానికి రేషన్ కార్డు లేక రుణమాఫీ కానోళ్లు, ఆధార్ కార్డులు, బ్యాంక్ అకౌంట్లలో తప్పులు మొదలైన సాంకేతిక కారణాలతో రుణమాఫీ కానోళ్ల వివరాలన్నీ ఈ సర్వేలో సేకరిస్తారని ప్రభుత్వం ప్రకటించింది. కానీ క్షేత్రస్థాయిలో అలా జరగడం లేదని తెలిసింది. రేషన్ కార్డు లేనోళ్ల వివరాల నమోదులోనూ ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు చెబుతున్నారు. ఉదాహరణకు.. నెన్నెల మండలం కేంద్రానికి చెందిన రైతు నారాయణ ఇంటికి వచ్చిన అధికారులు ఆయన భార్య, పిల్లలు వారి ఆధార్‌కార్డుల వివరాలు తీసుకొని యాప్‌లో నమోదు చేశారు. నారాయణతో పాటు ఆయన భార్య పేరుమీద రుణం ఉంది. ఆ వివరాలు కూడా నమోదు చేయాలని రైతు అడగ్గా.. యాప్‌లో తీసుకోవడం లేదని.. మీ భార్య పేరు కొట్టగానే అల్రెడీ ఎంటర్ అని చూపిస్తుందని అధికారులు చెప్పినట్లు రైతు నారాయణ తెలిపారు. ఇప్పుడు నా ఒక్కడి పేరు మీద ఉన్న లోన్ మాత్రమే మాఫీ అవుతుందా.. మా భార్య మీద ఉన్న లోన్ కూడా మాఫీ అవుతుందా.. వివరాలు ఎందుకు తీసుకోలేదని అడిగితే యాప్‌లో తీసుకోవడం లేదని, మాకు కూడా పూర్తిగా తెలియదని అధికారులు చెప్పినట్లు సమాచారం. ఆధార్ కార్డులు, బ్యాంక్ వివరాల్లో తప్పుల కారణంగా రుణమాఫీ కానీ రైతులు ఏం చేయాలంటే.. అలాంటి రైతులు దరఖాస్తులు చేసుకోవాలని.. ప్రస్తుతానికి రేషన్ కార్డు లేని వారి నుంచి అఫిడవిట్ తీసుకొని యాప్‌లో వివరాలు నమోదు చేయాలని మాత్రమే మాకు ఆదేశాలు ఉన్నాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. కాగా, సైట్ ఓపెన్ కాకపోవడంతో గురువారం అనేక మండలాల్లో సర్వే చేయలేదని తెలిసింది.

### సర్వేకు మార్గదర్శకాలు..

రుణమాఫీ కానీ రైతుల వివరాల నమోదుకు వ్యవసాయ శాఖ మార్గదర్శకాలను విడుదల చేసింది. అధికారులు, రైతులు ఆ మార్గదర్శకాలను అనుసరించడంతో పాటు అఫిడవిట్‌ను తప్పనిసరి చేసింది. వ్యవసాయ శాఖ విడుదల చేసిన మార్గదర్శకాలకు.. క్షేత్రస్థాయి పరిస్థితులకు చాలా తేడాలున్నాయి. దీంతో రైతులకు కొన్ని ఇబ్బందులు సైతం ఎదురవుతున్నాయి. అవేంటో చూద్దాం.


కాసిపేట మండలం ముత్యంపల్లిలో రైతుల వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న అధికారి

### క్షేత్రస్థాయిలో జరుగుతున్నది..

- రుణమాఫీ కాని రైతు ఇంటిని ఎంఏవో తప్పనిసరిగా సందర్శించాలి. ● అధికారులు వచ్చారని తెలిసి ఇంటికి రావడానికి ముందే రైతులు అధికారులు ఉన్న దగ్గరకు వెళ్తున్నారు. దీంతో గ్రామ పంచాయతీ కార్యాలయంలో, రైతు వేదిక దగ్గర వివరాలు నమోదు చేస్తున్నారు. ఏ ఒక్కటీ లేకపోయినా మళ్లీ ఇంటికి వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి. కొన్ని చోట్ల అధికారులు ఇంటికి రాకుండా రైతులకు ఫోన్లు చేసి పిలిపించుకుంటున్నట్లు తెలిసింది. ● రైతు వెల్లడించే కుటుంబ సభ్యుల వివరాలను ఆధార్ నంబర్‌తో సహా నమోదు చేయాలి. కుటుంబ సభ్యుల వివరాలతో పాటు ఆధార్ నంబర్, వయసు నమోదు చేస్తున్నారు. దీంతో కుటుంబంలో రుణం ఉన్న మరో వ్యక్తి వివరాలు యాప్‌లో నమోదు చేయడానికి వీలు లేకుండా పోతుంది. ఒకసారి పేరు ఎంటర్ చేశాక మరోసారి కొడితే ఆల్రెడీ ఎంటర్ అని చూపిస్తున్నది. ఇది సాంకేతిక సమస్యనా, లేకపోతే ఆధార్‌కార్డు వివరాలు ఉన్నాయి కాబట్టి దానికదే కుటుంబంలో రుణం ఉన్న రెండో వ్యక్తి వివరాలు తీసుకుంటుందా అనేది క్లారిటీ లేదు
- రుణమాఫీ లాగిన్‌లో రైతు కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేయడానికి ఇచ్చిన మొబైల్ యాప్‌లో వివరాలు నమోదు చేయాలి. ● సాంకేతిక సమస్యలు, సైట్ ఓపెన్ కాకపోవడంతో కొన్ని చోట్ల వివరాల నమోదు చేయడం కుదరడం లేదు. కొన్ని బ్యాంక్‌ల సైట్లు ఓపెన్ అవుతుంటే, మరికొన్ని బ్యాంక్‌ల సైట్లు యాప్‌లో ఓపెన్ కావడం లేదు.

### రైతులను అవమానిస్తున్నరు

అన్ని అర్హతలున్నా రైతులకు రేషన్ కార్డు లేదని రుణమాఫీ చేయలే. రేషన్‌కార్డు లేకపోవడం మా తప్పా. ముందేమో సీఎం రేవంత్‌రెడ్డి రేషన్‌కార్డు ప్రామాణికం కాదన్నరు. ఆ తర్వాత రేషన్ కార్డు లేదని చేయలేదన్నరు. ఇప్పుడేదో సర్వే అని అధికారులు వస్తున్నరు. తప్పుడు వివరాలు ఇచ్చి మాఫీ పొందాల్సిన అవసరం మాకేంటి. రైతుల నుంచి అఫిడవిట్ తీసుకోవడం రైతులను అవమానించడమే అయితది. న్యాయంగా జరగాల్సిన మాఫీలో ఇన్ని రకాల కొర్రీలు పెట్టడం సరికాదు. బేషరతుగా రైతులందరికీ రూ.రెండు లక్షల మాఫీ చేయాలి. *- రాళ్లబండి రమాదేవి, కోటపల్లి*




పాఠశాల బంద్ ఉండడంతో ఆడుకుంటున్న విద్యార్థులు

## సార్లు రారు.. చదువు చెప్పరు

● ఉపాధ్యాయులు లేక తెరచుకోని పాఠశాలలు ● ఆట.. పాటల్లో విద్యార్థులు

కాసిపేట, ఆగస్టు 29 : సాలేగూడ ట్రైబల్ వెల్ఫేర్ దిశా మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయులు లేక విద్యార్థులు ఆరు బయట ఆడుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇటీవల ఇక్కడి ఉపాధ్యాయుడు బదిలీపై వెళ్లగా, అప్పటి నుంచి ఇక్కడ ఎవరూ చేరలేదు. దీంతో విద్యార్థులు ప్రతి రోజూ స్కూల్‌కి రావడం.. పాఠశాల తెరచుకోకపోవడంతో అక్కడే కాసేపు ఆడుకోవడం.. ఆపై ఇంటిబాటపట్టడం సర్వసాధారణమైంది. ఇక్కడే కాదు మల్కేపల్లి, లక్ష్మీపూర్, నాయకపుగూడ, పాత తిరుమలాపూర్, కొలంగూడ, కొండాపూర్ తదితర పాఠశాలల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఈ విషయమై మల్కేపల్లి ఆశ్రమ పాఠశాల కాంప్లెక్స్ హెచ్‌ఎం లక్ష్మణ్‌ను వివరణ కోరగా.. ఇటీవల బదిలీ వెళ్లిన ఉపాధ్యాయుల స్థానంలో కొత్తవారు రాలేదని, అప్పటి వరకు తాత్కాలికంగా ఉపాధ్యాయులను నియమిస్తామన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని, త్వరలో శాశ్వత పరిష్కారం చూపుతామని చెప్పారని ఆయన తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి ఉపాధ్యాయులను నియమించాలని స్థానికులు కోరుతున్నారు.


తాళం వేసి ఉన్న దిశా మోడల్ స్కూల్

## కోట్నాక భీంరావు సేవలు చిరస్మరణీయం

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఆగస్టు 29 : మాజీ మంత్రి కోట్నాక భీంరావు సేవలు చిరస్మరణీయమని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, మాజీ ఎమ్మెల్యే సక్కు అన్నారు. కోట్నాక భీంరావు 22 వర్ధంతిని పురస్కరించుకుని గురువారం జిల్లా కేంద్రంలోని చిల్డ్రన్ పార్కులో ఆయన విగ్రహానికి అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, నాయకులతో కలిసి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆర్డీవో లోకేశ్వరరావు, బీఆర్‌ఎస్ నాయకురాలు మర్సుకోల సరస్వతి, నాయకులు కోవ సోనేరావు, సాయి, రవీందర్ ఉన్నారు.


భీంరావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, మాజీ ఎమ్మెల్యే సక్కు

### కోట్నాక్ భీంరావుకు నివాళి

జైనూర్, ఆగస్టు 29 : ఏజెన్సీ ప్రాంత ఆదివాసీ గూడేలా అభివృద్ధికి మాజీ మంత్రి స్వర్గీయ కోట్నాక భీంరావు చేసిన సేవలు గొప్పవని పీఏసీఎస్ చైర్మన్ కోడప హన్నూ పటేల్ అన్నారు. గురువారం నిర్వహించిన కొట్నాక భీంరావు 22 వర్ధంతిలో ఆయన పాల్గొన్నారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. సర్పంచుల సంఘం ఫోరం మాజీ మండల అధ్యక్షుడు మాడవి భీంరావు, నాయకులు కుమ్ర భగవంత్‌రావు రావు, మెస్రం అంబాజీ పాల్గొన్నారు.

# వచ్చిన వారానికే డిప్యూటేషన్

● వరంగల్ కార్పొరేషన్‌కు శ్యాంసుందర్ ● ప్రస్తుతం ఒక్క శానిటరీ ఇన్‌స్పెక్టర్ లేని మంచిర్యాల మున్సిపాలిటీ

● హెల్త్ అసిస్టెంట్‌తోనే నెట్టుకొస్తున్న వైనం ● పట్టనట్లు వ్యవహరిస్తున్న ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు



మంచిర్యాలటౌన్, ఆగస్టు 29 : మంచిర్యాల మున్సిపాలిటీకి బదిలీపై వచ్చిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం శ్యాంసుందర్ వారమైనా కాకుండానే వరంగల్ కార్పొరేషన్‌కు డిప్యూటేషన్‌పై వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. రికార్డుల్లో మంచిర్యాల మున్సిపాలిటీలో పనిచేస్తున్నట్లు కనిపించినా ఆయన పనిచేసేది మాత్రం వరంగల్ కార్పొరేషన్‌లోనే. ఇద్దరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పనిచేయాల్సిన చోట ఒక్కరికే పోస్టింగ్ ఇవ్వడం, ఇచ్చిన వారానికే డిప్యూటేషన్‌పై పంపించడం వెనక ఆంతర్యమేమిటన్నది అంతుబట్టడం లేదు. నిజానికి ఉండాల్సిన ఉద్యోగుల కంటే ఎక్కువగా ఉన్నప్పుడు, పనిభారం అంతగా లేనప్పుడు వారి సేవలు ఇతర ప్రాంతాల్లో అవసరమైతే డిప్యూటేషన్‌పై పంపిస్తుంటారు. కానీ, మంచిర్యాల మున్సిపాలిటీలో ఇద్దరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పనిచేయాల్సి ఉండగా, ఒక్కరు కూడా లేకుండా పోయారు. రామగుండం కార్పొరేషన్‌లో సరెండర్ అయిన శ్యాంసుందర్‌కు ఈ నెల 19న మంచిర్యాల మున్సిపాలిటీకి శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పోస్టింగ్ ఇస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. 23న ఆయన ఇక్కడ జాయిన్ అయ్యారు. కాగా, తాజాగా 27న శ్యాంసుందర్‌కు వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌కు డిప్యూటేషన్ కల్పిస్తూ ఇదే మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ మేరకు గురువారం శ్యాంసుందర్ మంచిర్యాల నుంచి రిలీవ్ అయ్యారు. దీంతో మంచిర్యాల మున్సిపాలిటీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ లేకుండా పోయారు. వాస్తవానికి మంచిర్యాల మున్సిపాలిటీకి రెండు శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోస్టులు, రెండు హెల్త్ అసిస్టెంట్ పోస్టులు మంజూరై ఉన్నాయి. కానీ, ఇక్కడికి వచ్చిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ డిప్యూటేషన్‌పై వెళ్లడంతో ప్రస్తుతమున్న ఒక్క హెల్త్ అసిస్టెంటే పారిశుధ్య బాధ్యతలు చూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో పట్టణంలో పారిశుధ్యం పరిస్థితి ఎలా ఉంటుందోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది. అసలే సీజనల్ వ్యాధుల కాలం, ఆపై డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు విజృంభిస్తున్న ప్రస్తుత తరుణంలో ముఖ్యమైన పారిశుధ్య బాధ్యతలు చేపట్టాల్సిన అధికారులు లేకపోవడంపై పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. బదిలీల సందర్భంగా ఇక్కడకు ఇద్దరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఇద్దరు హెల్త్ అసిస్టెంట్లు వస్తారని , దీంతో పారిశుధ్య వ్యవస్థ మెరుగుపడుతుందని పాలకవర్గ సభ్యులు భావించారు. కానీ అలా జరుగలేదు. ఇద్దరు కాదుకదా.. వచ్చిన ఒక్కరూ డిప్యూటేషన్‌పై వెళ్లడం వారిని ఆశ్చర్యానికి గురిచేసింది.

### రోజుకు 45 మెట్రిక్ టన్నుల చెత్త

35 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న మంచిర్యాల పట్టణంలో 36 వార్డులు ఉన్నాయి. ప్రధాన రహదారులు, అంతర్గత రహదారులు, కమర్షియల్ ప్రాంతాలు, శివారు కాలనీలలో నుంచి నిత్యం 45 మెట్రిక్ టన్నుల చెత్త వస్తోంది. 60 వాహనాల్లో చెత్తను డంప్ యార్డుకు తరలిస్తుంటారు. ఇందుకోసం 70 మంది శాశ్వత పారిశుధ్య కార్మికులు, 275 మంది కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారు. లక్షకు పైగా జనాభా, 28 వేలకు పైగా భవనాలు కలిగి ఉన్న మంచిర్యాలలో పారిశుధ్య పనులు ఎంతో బాధ్యతగా చేపట్టాల్సి ఉంటుంది. జిల్లా కేంద్రమైన మంచిర్యాలకు నిత్యం వేలాదిగా ప్రజలు విద్య, ఉపాధి, వైద్యం, ఇతర అవసరాలకోసం వస్తూ వెళ్తుంటారు. ఇలాంటి పట్టణంలో పారిశుధ్య పనులను నిర్వహించడం సవాలుగా తీసుకోవాల్సిన ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు.


ఖర్జీలో జ్వరంతో బాధపడుతున్న ఒడీల బండక్క

## విజృంభిస్తున్న విషజ్వరాలు

దహెగాం, ఆగస్టు 29 : దహెగాం మండల కేంద్రంతో పాటు ఖర్జీ, గిరివెల్లి, ఒడ్డుగూడ, చౌక గ్రామాల్లో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. దాదాపు ఇంటికొకరు మంచం పట్టినట్లు తెలుస్తున్నది. కొందరు ఆర్‌ఎంపీ వైద్యులను ఆశ్రయిస్తుండగా, మరికొందరు మంచిర్యాల, కరీంనగర్, వరంగల్‌లాంటి పట్టణాలకు పరుగులు పెడుతున్నారు. తీవ్రమైన జ్వరం, ఒళ్లు నొప్పులతో బాధపడుతున్నారు. వైద్య సిబ్బంది అప్పుడప్పుడూ వచ్చి నామమాత్రంగా మందులిచ్చి వెళ్తున్నారని, గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## క్రీడా స్ఫూర్తితో ముందుకెళ్లాలి

● కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే ● కలెక్టరేట్‌లో క్రీడా దినోత్సవం

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఆగస్టు 29 : గెలుపోటములు సహజమని, ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తితో ముందుకెళ్లాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో క్రీడాదినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు క్రీడలను ప్రారంభించారు. జిల్లా అధికారులతో కలిసి చెస్, క్యారం తదితర ఆటలు ఆడారు. అనంతరం గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# శాంతిఖనిలో పవర్ బ్రేక్ డౌన్

● నీట మునిగిన బోల్డర్ మైనర్ ● మరమ్మతులు చేస్తే పనిచేస్తుందా అన్నదానిపై స్పష్టత కరువు

● నిలిచిన బొగ్గు ఉత్పత్తి ● అధికారుల నిర్లక్ష్యమేనంటూ ఆరోపణలు


మందమర్రి ఏరియా శాంతిఖని లాంగ్‌వాల్ ప్రాజెక్టు ముఖద్వారం

బెల్లంపల్లి, ఆగస్టు 29 : మందమర్రి ఏరియా శాంతిఖని గనిలో పవర్ బ్రేక్ డౌన్ కావడంతో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. బుధవారం తెల్లవారు జామున మూడు గంటలకు బ్రేక్ డౌన్ కాగా, రంగంలోకి దిగిన ఎలక్ట్రిక్ అధికారులు ఎక్కడ సమస్య వచ్చిందో తెలుసుకోవడానికి నానా తంటాలు పడ్డారు. అన్ని సబ్ స్టేషన్ల వద్ద కార్మికులను ఉంచి సమస్య ఎక్కడ వచ్చిందో తెలుసుకోవడానికి శతవిధాలా యత్నించారు. చివరకు 54వ లెవల్ వద్ద సమస్యను కనుగొన్నారు. అప్పటికప్పుడు ఆ లెవల్ నుంచి కిందికి నూతన కేబుల్ వేసి మధ్యాహ్నం మూడు గంటలకు విద్యుత్‌ను పునరుద్ధరించారు. విద్యుత్ లేని కారణంగా బోల్డర్ మైనర్ (బీఎం)దగ్గర ఉన్న పంపులు పని చేయలేదు. దీంతో 13 మీటర్ల పొడవు ఉన్న బోల్డర్ మైనర్ (బీఎం)సగం వరకు మునిగిపోయింది. దీంతో గురువారం వరకు బొగ్గు ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోయింది. ఇప్పటి వరకు 800 టన్నుల బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయిందని, శుక్రవారం కూడా బొగ్గు వెలికితేసేది కష్టమేనని తెలిసింది.

### అధికారుల నిర్లక్ష్యమేనా..?

అధికారులు ముందస్తు చర్యలు తీసుకుంటే పవర్ బ్రేక్ డౌన్‌వంటి సమస్యలు తలెత్తవని కార్మికులు పేర్కొంటున్నారు. పవర్ సర్క్యూట్ లైన్‌తో పాటు పాత కేబుల్ జాయింట్లను ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే బ్రేక్ డౌన్ అయినట్లు తెలుస్తున్నది. రెండు రోజుల క్రితం 7డిప్ 65 లెవల్‌లో సౌత్ సైడ్ కార్నర్ కూలిపోయి రెండు రోజులు బొగ్గు ఉత్పత్తి నిలిచిపోగా, తాజాగా బ్రేక్ డౌన్‌తో మరో రెండు రోజుల పాటు పూర్తిగా బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయిందని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా 12 గంటల పాటు నీట మునిగిన బోల్డర్ మైనర్ పని తీరు ప్రశ్నార్థకంగా మారింది. కాగా, ఈ యంత్రానికి మరమ్మతులు చేస్తే పనిచేస్తుందా లేక వేరేది తీసుకురావాల్సి ఉంటుందా అన్నదానిపై స్పష్టత లేదు.


శాంతిఖని గని

